

యూరియా తిప్పలు

- జిల్లాలో యూరియా కోసం సొసైటీల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- వచ్చిన స్టాక్‌ను అధికంగా కొనుగోలు చేస్తున్న బడా రైతులు
- యూరియా దొరకక సమస్యలు ఎదుర్కొంటున్న సన్న, చిన్నకారు రైతులు
- శాఖల మధ్య సమన్వయ లోపంతో పలు చోట్ల ఏర్పడుతున్న సమస్యలు

నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆరుగాలం కష్టపడే రైతులకు తిప్పలు తప్పడం లేదు. యూరియా కోసం నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. సొసైటీలు, డీలర్ల వద్దకు తిరుగుతూ ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం లైన్లలో నిలబడుతూ యూరియాను కొనుగోలు చేస్తున్నారు. కొన్ని సొసైటీల పరిధిలో యూరియా సరైన కేటాయింపులు లేకపోవడంతో ముందస్తుగానే రైతులు డబ్బులను కడుతూ యూరియా తెప్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రైవేట్ డీలర్లు, బడా రైతులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం వల్ల సన్నకారు, చిన్నకారు రైతులకు దొరకడం లేదు. కొన్ని సొసైటీల పరిధిలో రైతుల సాగు భూమి ఆధారంగా యూరియా బస్తాల కేటాయింపులు చేస్తున్నా స్టాక్ సరిపోక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

25వేల 580మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

జిల్లాలో వానాకాలంలో 75వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగిస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 25వేల 580మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశారు. మరో 16వేల 500మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సొసైటీలతో పాటు ప్రైవేట్ డీలర్ల ద్వారా ఈ యూరియాను సరఫరా చేస్తున్నారు. మార్క్‌ఫెడ్, కంపెనీ గోడౌన్లు, ప్రైవేట్ డీలర్లకు కేటాయింపు చేస్తూనే 60శాతం వరకు సహకార సొసైటీలకు అందజేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఈ యూరియాను సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 89సొసైటీలు ఉండగా 13 సొసైటీలు మినహాయించి ఇతర సొసైటీల ద్వారా ఈ యూరియాను సరఫరా చేస్తున్నారు. గతంలో ఈ 13సొసైటీలు ఎరువులు తీసుకుని డబ్బులు మార్క్‌ఫెడ్‌కు చెల్లించకపోవడం వల్ల వాటిని నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి యూరియాను సరఫరా చేయకపోవడం, వచ్చే యూరియాలో కొంత కోత పెట్టి ఇతర జిల్లాలకు కేటాయించడం కూడా జిల్లాలో కొన్ని గ్రామాలు, మండలాల పరిధిలో యూరియా కొరతకు కారణమవుతుంది. యూరియాతో పాటు డీఏపీ 13072 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 13105, కాంప్లెక్స్ 44480 మెట్రిక్ టన్నులు అవసరమని వ్యవసాయ అధికారులు అంచనా వేసారు. ఈ మూడు ఎరువులకు ఇబ్బందులు లేకున్నా ప్రధానంగా యూరియాకు మాత్రమే కొరత ఏర్పడింది. జిల్లాలో పంటలసాగుకు అనుగుణంగా యూరియా కేటాయింపులు చేస్తూ రైతులకు సరఫరా చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి వీరస్వామి తెలిపారు. ప్రతిరోజు మండల స్థాయిలో సమీక్షిస్తూ రైతులు వేస్తున్న పంటలకు అనుగుణంగానే యూరియాను అందే విధంగా చూస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో యూరియా కొరత ఏర్పడిన మాట వాస్తవమేనని వెంటనే సమాచారం తెప్పించుకొని ఆ ప్రాంతాల్లో యూరియా స్టాక్ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



సొసైటీ ఎదుట ఎరువుల కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

జిల్లాలో భారీగా పంటల సాగు

జిల్లాలో పంటలసాగు భారీగా పెరుగుతోంది. ఈ సంవత్సరం 5లక్షల 43వేల ఎకరాలకు పైగా సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనిలో 4లక్షల 15వేల ఎకరాల వరకు ఈ వానకాలంలో వరి వేస్తారని అంచనా వేశారు. గత జూన్ నుంచి ఇప్పటి వరకు 2లక్షల 50వేల ఎకరాలకు పైగా పంటలను సాగు చేశారు. ఆరుతడి పంటల కంటే వరిసాగే ఎక్కువగా వేస్తున్నారు. జిల్లాలో ఆరుతడి పంటలు మొక్కజొన్న, పసుపు, సోయా వేసిన రైతులు వరిసాగును జూన్ ఆరంభం నుంచే మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం లక్షా 45వేల ఎకరాల వరకు వరిసాగు అయింది. వరిసాగు చేస్తున్న రైతులు నాట్లు వేసిన తర్వాత ఎక్కువ మొత్తంలో యూరియాను వినియోగిస్తారు. పంట పూర్తయ్యే వరకు నాలుగు లేదా అయిదు విడతల్లో యూరియాను వేస్తారు. రాష్ట్రంలో అత్యధికంగా యూరియాను వినియోగిస్తున్న జిల్లా కూడా నిజామాబాదే కావడంతో మొదటి నుంచి యూరియా కోసం అధికారులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడు హైదరాబాద్‌లో కాంగ్రెస్ బహిరంగ సభ

- హాజరుకానున్న ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు
- జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి సభకు హాజరవుతున్న బూత్ కమిటీ సభ్యులు
- ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పీసీసీ సభ్యులు, ఇతర నేతలు



నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం పీసీసీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలేందుకు ఏర్పాట్లు చేశారు. ఈసమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతుండడంతో భారీగా తరలేందుకు శ్రేణులు సిద్ధమయ్యారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో బూత్ కమిటీల సభ్యులు ఇందులో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి వారిని హాజరయ్యే విధంగా చూస్తున్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పీసీసీ కార్యదర్శులతోపాటు సీనియర్ నేతలు హాజరుకానుండడంతో ముఖ్య నేతలంతా హాజరు అయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సమావేశంలో బూత్ కమిటీల నేతలకే ప్రాధాన్యం ఉండడంతో వారికి పాస్‌లను అందజేస్తూ హాజరయ్యే విధంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కమిటీలకు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ యొక్క ఉద్దేశ్యాలను వివరిస్తూనే గ్రామాల్లో కార్యక్రమాలు చేసే విధంగా వారికి శిక్షణ అందించనున్నారు. పూర్తిగా గ్రామ అధ్యక్షులు, బూత్ కమిటీలు పాల్గొనే ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వారు హాజరయ్యే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. నియోజకవర్గానికి 500మంది చొప్పున తరలిస్తున్నారు. వారికి అవసరమైన వాహనాలను సమకూర్చుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బల్మూరి వెంకట్ సమన్వయంతో జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తంలో 2750మంది సభ్యులు హాజరయ్యే విధంగా ఈ ఏర్పాట్లను చేశారు. ఈ పాస్‌ల ఆధారంగానే వారికి ఈ సభలో ఎంట్రీ కల్పించనున్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డితో పాటు ఇతర నేతలు ఈ సభ విజయవంతం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమావేశంలో వీరితోపాటు రాష్ట్ర కార్పొ రేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్ రెడ్డి, ఈరవత్రి అనిల్, రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలు నగేష్ రెడ్డి, శేఖర్ గౌడ్, మునిపెల్లి సాయిరెడ్డి, మార చంద్రమోహన్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్‌తో పాటు ఇతర నేతలు హాజరు కానున్నారు. ఈ సభలో ప్రధానంగా బూత్ కమిటీల సభ్యులు పాల్గొంటుండడం వల్ల అన్ని ఏర్పాట్లను చేశామని జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు.

పసికందు అమ్మకానికి బేరం

- రూ.2లక్షలకు మగబిడ్డను అమ్మేందుకు తల్లిదండ్రుల ప్రయత్నం
- బేరం బెడిసి కొట్టడంతో తల్లిదండ్రులపై పోలీసుల కేసు నమోదు

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబం యొక్క పేదరికం పుట్టిన మూడు రోజుల పసికందును అమ్మకానికి పెట్టేలా చేసింది. నవమాసాలు మోసిన తల్లి, కుటుంబానికి పెద్ద దిక్కైన తండ్రి ఇద్దరు కలిసి ముక్కుపచ్చలారని పసికందును అమ్మకానికి పెట్టి బేరం కుదరకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన నిజామాబాద్ నగరంలో జరిగింది. నగరంలోని నాగారం 300 క్వాటర్స్‌లో నివాసం ఉండే నజీర్ దంపతులకు 3 రోజుల క్రితం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించింది. పుట్టిన మగబిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో తల్లిదండ్రులు ఆనందపడ్డారు. కానీ పూటగడవడమే కష్టంగా ఉన్న ఆ కుటుంబానికి పుట్టిన మగబిడ్డ బారం అయ్యాడు. నజీర్ కుటుంబ పరిస్థితి తెలిసిన ఒక ముఠా పుట్టిన మగబిడ్డను అమ్మాలంటూ బేరసారాలు ఆడారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న నజీర్ ఆ ముఠా చెప్పిన మాటలకు ఆలోచనలో పడి బిడ్డను అమ్మేందుకు భార్యను సైతం ఒప్పించాడు. 2లక్షల రూపాయలకు మగబిడ్డను అమ్మేందుకు బేరం కుదుర్చుకున్నారు. ఆసుపత్రి ఆవరణలోనే ముఠా లక్ష రూపాయలు ఇచ్చారు. మిగిలిన లక్ష ఆలస్యం కావడంతో నజీర్ భార్య బిడ్డను అమ్మేందుకు నిరాకరించింది. పేగుతెంచుకొని పుట్టిన మగబిడ్డను తనకు ఇవ్వాలని ముఠాను కోరింది. విషయం పోలీసులకు తెలియడంతో పసికందు అమ్మకం విషయంపై విచారణ చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు 1వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. పసికందును కొనుగోలు చేసిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

తైక్వాండో క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తైక్వాండోలో జాతీయ పతకాలను సాధించిన క్రీడాకారులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభినందించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్రీడాకారులను మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. గతనెల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 8వ ఓపెన్ నేషనల్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన ఆమెచూర్ తైక్వాండో అసోసియేషన్‌కు చెందిన 38 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇందులో 24 గోల్డ్‌మెడల్స్, 11 సిల్వర్ మెడల్స్ 3 బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఇన్ని మెడల్స్ సాధించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేసి జిల్లాకు పేరు తీసుకువస్తున్న తైక్వాండో మాస్టర్ మనోజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వ్యవసాయశాఖలో ఏవోలకు పదోన్నతి

నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారులకు పదోన్నతి వచ్చింది. ఏవోలుగా పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు ఇచ్చి ఇతర జిల్లాలకు బదలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్తర్వులకు అనుగుణంగా ఆ అధికారులు జిల్లాలో రిలీవ్ అయి తమకు కేటాయించిన జిల్లాల్లో రిపోర్ట్ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో పనిచేసి బాసర ఏవోగా ఉన్న శ్రీకర్‌ను ఏడీఏగా పదోన్నతి కల్పించి ఆదిలాబాద్ జిల్లా సాయిల్‌టెస్ట్ ల్యాబ్ ఏడీఏగా బదిలీ చేశారు. జిల్లావ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో టెక్నికల్ బి.శ్రీనివాస్‌ను ఆదిలాబాద్ ఎఫ్‌టీసీ ఏడీఏగా బదిలీ చేశారు. జిల్లావ్యవసాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మరో ఏవో టెక్నికల్ వి.గోపిని ఏడీఏగా పదోన్నతి కల్పించి మంచిర్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయానికి కేటాయించారు. రేంజల్‌లో పనిచేస్తున్న ఏవో బి.శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి ఆసిఫాబాద్ ఏడీఏగా నియమించారు. డిచ్‌పల్లి ఏవోగా పనిచే స్తున్న సుధమాదురి కి ఏడీఏగా పదోన్నతి కల్పించి ఎల్లారెడ్డి ఏడీఏగా బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు వెలువడడంతో జిల్లాలో వారు రిలీవ్ అయి తమకు కేటాయించిన జిల్లాల్లో గురువారం రిపోర్టు చేశారు.

బీసీ రిజర్వేషన్‌లపై మల్లికార్జున ఖర్గేకు ఎమ్మెల్సీ కవిత లేఖ



సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థలలో 42శాతం రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం, బిల్లుకు చట్టబద్ధత కల్పించడానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ జాతీయధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన బలహీనవర్గాలకు అనాధిగా విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ జాగృతి యూపీఎఫ్, బీసీ సమాజం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఉద్యమిస్తున్నా యని, ఈ ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఒక బిల్లు విద్య ఉద్యోగాలలో 42శాతం కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. ఈ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ వాటి ఆమోదం కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని లేఖలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేయడానికి ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని, రాజకీయ లబ్ధి పొందడానికి చూపుతున్న శ్రద్ధ బీసీ రిజర్వేషన్‌ల చట్టబద్దల కల్పించడానికి చూపడం లేదన్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించడానికి మీరు వ్యతిరేకమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాస్ చేసిన బిల్లుల ఆమోదం కోసం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. రాజ్యసభలో స్వయంగా ప్రతిపక్ష నేతగా ఉన్న ఖర్గే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పార్టీకి బీసీలు అండగా నిలవాలంటే వెంటనే బీసీ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలిపేలా ఒత్తిడి తీసుకురావాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

నేడు నగరంలో జగన్నాథ రథయాత్ర

నిజామాబాద్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం నుంచి జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుందని అధ్యక్షుడు రామానంద రాయ్ ప్రభుదాస్, ప్రతినిధులు స్వామియాదవ్‌లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా ప్రణవానందదాస్ హాజరై ప్రసంగించనున్నారని తెలిపారు. కంఠేశ్వర్ నుంచి మధ్యాహ్నం 1గంటకు రైల్వే కమాన్, రైల్వే స్టేషన్, బస్టాండ్, మెడికల్ కాలేజీ, గాంధీచౌక్, నెహ్రూపార్క్, శివాజీనగర్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా మీదుగా విజయలక్ష్మి గార్డెన్‌కు రథయాత్ర చేరుకుంటుందన్నారు. సాయంత్రం విజయలక్ష్మి గార్డెన్‌లో జగన్నాథ చప్పన్‌భోగ్ కార్యక్రమం ఉంటుందని వివరించారు.



పోలీసు శాఖలో ప్రక్షాళన!

కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర మార్క్ పాలనకు శ్రీకారం

- కామారెడ్డి జిల్లాలో 10 మంది ఎస్సైల బదిలీలు
- 8 మందికి పోస్టింగ్.. మరో ఇద్దరు వీఆర్‌లోకి
- ఇందులో కొందరిపై అవినీతి, అక్రమాల ఆరోపణలు
- భూతగాదాలు, ఇతర కార్యక్రమాల్లో తలదూర్చుతున్నారని ఫిర్యాదులు
- పోలీసుశాఖలో తనదైన మార్క్ చూపుతున్న కామారెడ్డి ఎస్పీ

కామారెడ్డి/కామారెడ్డిటౌన్(ఆంధ్రజ్యోతి), జూలై 3: కామారెడ్డి జిల్లా పోలీసుశాఖలో అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ రాజేష్ చంద్ర ప్రక్షాళనకు పూనుకున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లను చుట్టేసిన ఎస్పీ అక్కడి సిబ్బంది పనితీరు, నడవడిక, ప్రజలతో వారు మెలుగుతున్న తీరును పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇటీవల విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు వేశారు. అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న, భూ తగదాలు, ఇతర కార్యక్రమాల్లో తలదూర్చుతున్న ఒకరిద్దరు ఎస్సైలతో పాటు ఇతర ఎస్సైలను సైతం గురువారం బదిలీ చేయడంతో పోలీసుశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

అవినీతి ఆరోపణలతోనే బదిలీలా?

జిల్లా పోలీసుశాఖలో తాజాగా పది మంది ఎస్సైలను బదిలీ చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ బదిలీలకు కారణం పలువురు ఎస్సైలపై అవినీతి ఆరోపణలు, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోనే బదిలీలు చేశారని తెలుస్తోంది. బదిలీ అయిన వారిలో ఓ ఎస్సై భూ తగదాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని స్థానిక ప్రజాప్రతినిధి ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు ఎస్సైపై ఫిర్యాదు చేయడంతో తన ఆటలు సాగవని మరో పోలీసుస్టేషన్‌కు బదిలీచేయించుకునేందుకు రాష్ట్రస్థాయిలో లాబీయింగ్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అదేవిధంగా మరో ఎస్సై పేకాట కేసు విషయంలో సీజ్ చేసిన డబ్బులు కేసు కట్టి సమయంలో మొత్తం చూపలేదని, వడ్డీ వ్యాపారులకు వత్తాసు పలుకుతూ డబ్బులు తీసుకున్నవారిని ఇబ్బందులకు గురిచేశాడని సొంత శాఖలోని సిబ్బంది ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ సీరియస్‌గా వ్యవహరించి వారిని ఆ స్టేషన్‌లనుంచి స్థాన చలనం కలిగించారు. మరికొందరు ఎస్సైలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో వారిని బదిలీ చేశారని, ఇతర ఎస్సైల సేవలు ఆయా స్టేషన్ పరిధిలో అవసరమని గుర్తించినట్లు సమాచారం.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్


రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జూలై3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతులసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషిచేస్తుందని బోధన్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. గురువారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో రైతులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు హార్టికల్చర్ ఆధ్వర్యంలో తీగపందిళ్ల చెక్కులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చినహామీ ప్రకారం రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. రైతులు అన్ని పంటలను సాగుచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలోనే భాగంగా తీగపందిళ్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ వసంత్ రెడ్డి, బోధన్ హార్టికల్చర్ అధికారి వాహిద్, ఏవో శ్వేత, ఏఈవో శ్రావణి, సొసైటీ డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, పద్మారెడ్డి, ఖాజాపూర్ అశోక్, సొక్కం రవి, శంకర్, హున్స గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


భీమ్‌గల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై

భీమ్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై సందీప్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగా రౌడీషీట్ ఉన్న వ్యక్తులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో చట్టాన్ని చేతిలోకి తీసుకొని శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే అదుపులోకి తీసుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అలాగే ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

మోర్తాడ్‌లో ఉపాధ్యాయుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సమ్మిరెడ్డి

మోర్తాడ్ జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో టీచర్ల సర్దుబాటు కోసం సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రభాకర్, దొన్కల్ ప్రధానోపాధ్యాయులు డీజే జగదీశ్వర్‌లు కమిటీ సర్దుబాటు చేసింది. ఎలాలవాడు ఎంపీపీఎస్ నుంచి సుమలతను ఎంపీపీఎస్ సుంకెట్‌కు, ధర్మోర ఎంపీపీఎస్ నుంచి సతీష్‌ను రామ్‌నగర్ దోపాల్‌కు, తిమ్మాపూర్ నుంచి ఎల్. లిఖితను మధు నగర్ తిమ్మాపూర్‌కు, దొన్కల్ నుంచి కిరణ్‌కుమార్‌ను శెట్ పల్లికి, గాండ్లపేట్ నుంచి జ్యోతిని బాలిక పాఠశాల మోర్తాడ్‌కు సర్దుబాటు చేశామని ఎంఈవో తెలిపారు. సమావేశంలో ఉపా ధ్యాయసంఘాల నాయకులు ప్రవీణ్, బాలరాజు, రవీందర్, రమేష్, మధుసుధన్‌రావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమ్మేళన సభకు తరలిరావాలి


సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

జక్రాన్‌పల్లి, జూలై,3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో శుక్రవారం జరుగనున్న కాంగ్రెస్ సమ్మేళన సభకు జక్రాన్‌పల్లి మండలం అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి కోరారు. గురువారం జక్రాన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తీసుకున్న జైబాపు, జైభీమ్ కార్యక్రమంలో భాగంగా ఎల్‌బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో జరుగనున్న కాంగ్రెస్ గ్రామకమిటీల అధ్యక్షుల సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. సభకు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు



ఖానాపూర్‌లో ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న అధికారి

ఆర్మూర్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పాం పంటను సాగుచేసే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవనశాఖాధికారి రాజుగౌడ్ అన్నారు. గురువారం ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రీ యూనిక్ ఆయిల్ పాం సంస్థ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరిలింగాగౌడ్ ఆయిల్ పాం పంట సాగుకు ఆరుఎకరాలకు డీడీలు చెల్లించారు. అనంతరం రైతులకు ఆయిల్‌పాం పంట సాగుపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


సహాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయుడు

వేల్పూర్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో 2015వ సంవత్సరంలో తమతో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థి ఆకాష్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గత నెల 20న మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మృతుని తోటి విద్యార్థులు గురువారం పడిగెలలో వారి ఇంటికి చేరుకొని ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలియజేశారు. ఆనాటి క్లాస్‌మెంట్ అందరితో పాటు ఆనాటి ఉపాధ్యాయుడు సంగెం అశోక్ ఆధ్వర్యంలో రూ. 50వేలు ఆర్థిక సహాయం మృతిని కుటుంబానికి నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఆనాటి పూర్వ విద్యార్థులు అరవింద్, అరుణ్, భరత్, అమీర్, శివ, ఆనంద్, అనూష, శ్వేత, తదితరులున్నారు.

లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష జమ

భీమ్‌గల్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం రూ.లక్ష జమచేసిందని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఇళ్లులేని నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలు బేస్మిట్ వరకు పూర్తి అయిన లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమయ్యాయి. నిర్మాణ పనులు చేపట్టని వారు వెంటనే పనులు చేపట్టాలని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతిని సాధించాలి

కమ్మర్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇండ్ల నిర్మాణ పనుల్లో తగిన పురోగతిని సాధించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలో పైలెట్ గ్రామంగా ఎన్నికైన నాగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలకు మంజూరైన ఇండ్ల ప్రస్తుత నిర్మాణదశ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కూతుళ్లను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

ముప్కాల్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాంగిరి బాలగంగాధర్ తన ఇద్దరి కూతుళ్లను అదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్న అఖిల 7వ తరగతి, వర్షిణి 9వ తరగతి తమ పిల్లలను గురువారం పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంద న్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం ఉపాధ్యాయున్ని బాల గంగాధర్‌ను అభినందించారు.

సోలార్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

ఎడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకంపేట గ్రామ శివారులోగల శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిసరాల్లోని ఆలయ భూమిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సోలార్‌ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని గురువారం డీఆర్‌డీవో, దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులతో 2 మెగా వాట్ల విద్యుత్‌ఉత్పత్తి సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుందని, దీని నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన వారిలో డీఆర్‌డీఏ మధుసూదన్, డీపీఎం మోహన్, ఆలయ ఈవో వేణు, రెడ్కో సంస్థ ప్రతినిధులు, ఐకేపీ ఏపీఎం గంగారాం, సీసీ వినోద్, రఘు, జాన్కంపేట మహిళా సంఘం సభ్యులున్నారు.

సజ్జ పంట డబ్బులు ఇప్పించాలని వినతి

ముప్కాల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజర్ల గ్రామంలో యాసంగిలో వేసిన సజ్జపంటకు అగ్రిమెంట్ ప్రకారం క్వింటాలుకు రూ. 6,500 డబ్బులు సజ్జల యజమాని ద్వారా ఇప్పించామని వ్యవసా యాధికారికి వినతిపత్రం అందజేశారు. యాసంగిలో గడ్డం రాజేశ్వర్ క్వింటాలుకు రూ.6,500 చొప్పున సజ్జలు కొంటానని 30 మంది రైతులకు సజ్జ విత్తనాలు ఇచ్చి ప్రస్తుతం డబ్బులు చెల్లించడం లేదని, దీని ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఒప్పందం ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమలో సీహెచ్ రవి, జంగం మురళి, సుంకరి గబ్రేల్, జంగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

ముప్కాల్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను జీఈసీవో భాగ్యలక్ష్మీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వినోద, ఏపీఎం ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

'నిరుపేదలు, విద్యార్థులకు అండగా ఉంటాం'

వర్ని, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు, పేదవిద్యార్థులకు అండగా ఉంటామని సీసీ డీ మేనేజర్ ఠాగూర్ హామీ ఇచ్చారు. గురువారం వర్నిలో నిరుపేదలకు నిత్యావసర సరు కులు, పాఠశాల విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు అతిమెల నగేష్, పీవీ సుబ్బారావు, నర్సయ్య, నగేష్, భాస్కర్, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక శిక్షణ

నాగిరెడ్డిపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామసంఘాల పాలక వర్గ సభ్యులకు గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 32 గ్రామ సంఘాలుండగా, మొదటగా గురువారం మండలంలోని 16 గ్రామసంఘాల పాలకవర్గ సభ్యులైన అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారులకు కరీంనగర్ జిల్లాకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు సంగీత, పుష్పలతలు శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంత, కోశాధికారి మణెమ్మ, ఏపీఎం జగదీష్ కుమార్, అకౌంటెంట్ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవునిపల్లిలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు : ఎంఈవో

ఎల్లారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఎల్లారెడ్డి ఎంఈవో రాజులు అన్నారు. గురువారం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఎన్ని మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాలకు రెండు తరగతి గదిలో ఉండగా ఒక భవనం శిథిలావస్థలో ఉండడంతో మరో భవనంలో విద్యార్థులుంటున్నారని ఇబ్బందులు లేవని అన్నారు.

'బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి'

జక్రాన్‌పల్లి, జూలై,3 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని 44వ జాతీయ రహదారి నుంచి ఆదర్శపాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు వెళ్లే బీటీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా మారిందని, పనులను తక్షణమే చేపట్టాలని మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జక్రాన్‌పల్లిలో ఈ పాఠశాలలకు వెళ్లే చెడి పోయిన బీటీరోడ్డును కన్నెపల్లి ప్రసాద్, బీజేపీ నాయకులు కలిసి పరిశీ లించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీటీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలన్నారు.

అత్తను నరికి చంపిన అల్లుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

పిట్లం జులై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం అత్తను కమ్మకత్తితో గొంతు కోసి హత్యచేశాడు అల్లుడు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నలక్ష్మి (50) అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో వంటమనిషిగా విధులు నిర్వహిస్తుంది. బ్రాహ్మణపల్లి గ్రామంలో మిట్ట మధ్యాహ్నం ఊరులోనే జిన్న లక్ష్మి అనే మహిళను అలుడు జిన్న బాగరాజు కమ్మకత్తితో చంపాడు. విషయం తెలిసిన పోలీ సులు ఎస్సై రాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. బాన్సువాడ డీఎస్పీ విఠ లోరెడ్డి, సీఐ రాజేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తీసుకున్న అప్పు చెల్లించమని అత్త అల్లుడిని అడుగగా గోడవపడి కోపంతో కమ్మకత్తితో ఆమె గొంతు కోసి నరికి చంపాడని పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు అయిన జిన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతురాలికి కోడుకు, కుతురున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


వాటర్ క్లోరినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి

ఎల్లారెడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్‌లు వాటర్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ఎప్పటికప్పుడు లీకేజీలకు మరమ్మతులు చేయాలని, అదేవిధంగా వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వినోద్ కుమార్, వార్డు అధికారులు, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, వార్డు అధ్యక్షుడు బెస్త రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, సాయిరాం, ప్రశాంత్, భూమయ్య పాల్గొన్నారు.

'ధృవపత్రాల కోసం మీ సేవాలో దరఖాస్తులు ఇవ్వాలి'

ఎడపల్లి, జులై03(ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల ధృవపత్రాలు అవసరం ఉన్నవారు తమ దరఖాస్తు ఫారాలను రిజిస్ట్రేషన్ చేసుకున్న మీసేవా కేంద్రంలోనే అందించాల, నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావద్దని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి అన్నారు. గురువారం మండల మీసేవా కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీసేవా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి మీ సేవా నిర్వాహకులు నేరుగా తీసుకురావాలన్నారు.

కేజీబీవీ పాఠశాలకు కాంస్య పతకం

ముప్కాల్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థి శ్రీలత 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వినోద తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ -10, 12, 14 విభాగంలో 26 మంది విద్యార్థులు ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

భీమ్‌గల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో గురువారం ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత వస్త్రవు లు, మధ్యాహ్నభోజనం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్, బాల్కొండ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సేపూర్ చరణ్‌గౌడ్, గ్రామకమిటీ అధ్యక్షుడు వంజరీ శంకర్, విద్యాకమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంధ్య, భూమేశ్వర్, రాగి నరసింహచారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఎంఈవో శంకర్ పంపిణీ చేశారు. పాఠశాలలో 349 మంది విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులను అందజేశామన్నారు. మరో జత త్వరలోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు నాగనాథ్, రామారావు, సుజాత, షబానా పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవీపేట,జూలై3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని నవతెలంగాణ విద్యార్థి సంఘం కార్యదర్శి పల్లపు తులసిరాం కోరారు. గురువారం మండల విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్‌లను విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, నవీన్ తదితరులున్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

నవీపేట, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇందులో చాలా దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తికాలేదని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందిగామ మాజీ సర్పంచ్ సాయన్న, భూంరావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలి

నసురుల్లాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి భవాని అన్నారు. గురువారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని సొసైటీ పరిధిలో యూరియా స్టాక్ ఉందా లేదా అని సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాట్లు వేశాక రైతులకు యూరియా తప్పకుండా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆమె వెంట సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు ఉన్నారు.

ఆలూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆలూర్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పన్నెండుమందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం బీజేపీ నాయకుడు డాక్టర్ అరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆలూర్ గ్రామంలో ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సనిమిత్తం ఖర్చులను సీఎంఆర్ ద్వారా ఇప్పిస్తానని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హరీష్, మల్లయ్య, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు

భీమ్‌గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన జిల్లా కేంద్రానికి చెందిన బండారి రఘురాం యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన రఘురాం యాదవ్ సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన దళిత యువతిని 2021లో ప్రేమించి వివాహం చేసుకున్నాడన్నారు. ఇప్పుడు తప్పించుకు తిరుగుతున్నాడని, చట్టప్రకారం శిక్షించాలని ఫిర్యాదులో దళిత సంఘం సభ్యులు కోరారు.

ఇసుక లారీ పట్టివేత

ఎడపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి గుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. బుదవారం రాత్రి 3 గంటల ప్రాంతంలో బోధన్ నుంచి నిజామాబాద్ వైపు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి, ఓనర్ అజీజ్, డ్రైవర్ సిరాజ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్, జూలై3(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ, నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని మాస్టర్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్‌లతో కళాశాల విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా తహసీల్దార్‌గా రాజశేఖర్

మోస్రా,జూలై3(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ మారుతి బదిలీపై వెళ్లగా ఆర్‌డీవో కార్యాలయం బోధన్‌లో డిప్యూటీగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ మోస్రా తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రుద్రూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కాపాడి చెరువుకి రక్షణ కల్పించాలని గురువారం చిక్కడ్‌పల్లి గ్రామస్థులు రుద్రూరు తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రాన్ని అందజేశారు. చిక్కడ్‌పల్లి శివారులోని సర్వేనెంబర్ 202/ఇలోని 0.20గుంటల భూమిని ఓ వ్యక్తి కబ్జాచేసి పట్టా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాలను రద్దు చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుర్మరాజు, కర్రోళ్ల రాజయ్య, నక్క గంగాధర్, జెల్ల పరమేష్, కుర్మ మల్లయ్య పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి జైలు

కోటగిరి,జూలై3(ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఒకరోజు జైలుశిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమాన విధించినట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. పొతంగల్ మండలంలోని కొల్లూర్‌లో ఏప్రిల్ 16వ తేదీన షేక్‌అతిక్, షేక్ సోహెల్, షేక్‌అవేజ్ అనే ముగ్గురువ్యక్తులు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి నాలుగు ఎద్దులను వాహనంలో అక్రమ రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చగా బోధన్ న్యాయాధికారి శేషతల్ప సాయి నిందితులకు ఒకరోజు జైలుశిక్షతో పాటు 3వేల రూపాయల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రెంజల్,జూలై3(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన శివరాత్రి పెద్దసాయిలు మద్యం సేవించి వాహనం నడపడంతో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేశామని, గురువారం బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

'ప్రజలు సుఖశాంతులతో ఉండాలి'

బోధన్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు శ్రీకృష్ణుడి ఆశీర్వాదంతో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ, ఇస్కార్ ప్రతినిధులు సీతారాయ్‌దాస్, రత్నమాయి రాధికదేవిదాస్, కేశవ కరుణానిధి దాస్, అశోక్ ఆత్మదాస్ ఉన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు

మాక్లూర్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయ్ కళాశాల ఆఫ్ ఫార్మసీలో గురువారం ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పింగళి నర్సింహారావు హాజరై మాట్లాడుతూ హెచ్‌ఐవీ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశంపై వివరించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు నివాళి

వేల్పూర్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామంలో జ్యోతిబాపూలేకు అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నివాళులు అర్పించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి జాంబవచామర్, ఉపాధ్యక్షుడు సుమన్, రణవీర్, బీసీ సంఘం నాయకులు కిషన్, కిషన్ తదితరులున్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్ రూరల్, జూలై,3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో గురువారం మాల మహనాడు, యశోబుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటిక ప్రదర్శన పోస్టర్లను ఆవిష్క రించారు. ఈనెల 5వ తేదీన పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో సాయంత్రం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాలమహనాడు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న, ప్రధాన కార్యదర్శి మూగ ప్రభాకర్, పింజ పెద్దబోజన్న తెలిపారు. కార్యక్రమంలో తాళ్ల రాజయ్య, కృషాల్, అగ్గు క్రాంతి, అంగరి ప్రదీప్, తెడ్డు నర్సయ్య పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

బంజారాల సమస్యలపై పోరాడుతాం

● ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం

జిల్లా అధ్యక్షుడు బాబురాం నాయక్

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బంజారాల సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాడుతామని నూతనంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బాబు రాం నాయక్ అన్నారు. గురువారం నగరంలోని సంఘ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రునాయక్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రూప్ రాజకీయాలకు తావులేకుండా రాజకీయాలకు అతీతంగా ఏ పార్టీకి వత్తాసు పలుకకుండా ప్రభుత్వ సహకారంతో గిరిజనుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలతో కలిసి బంజారాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాన న్నారు. బంజారా భవన్ నిర్మాణం, ఫంక్షన్‌హాల్ కోసం పనిచేస్తానని, పోడుభూముల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రాములు నాయక్ తీరు మార్చుకోవాలి..

అన్నదమ్ముళ్లా కలిసి ఉన్న బంజారాలను విడదీసేందుకు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ బంజారాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రునాయక్ అన్నారు. బంజారాల హక్కుల కోసం పనిచేస్తూ రాజకీయంగా ఉన్నత పదవులను అనుభవించిన రాములు నాయక్ తన స్వార్థ ప్రయోజనాల కోసం కొత్తగా కమిటీలను నియమిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఆయన తీరు మార్చుకోవాలని లేదంటే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామన్నారు. రాములు నాయక్‌కు జాతీయ కమిటీతో సంబంధం లేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను చంద్రునాయక్ సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ నాయక్, సురేష్ నాయక్, రాథోడ్ విఠల్, శంకర్‌నాయక్, వినోద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దాశరథి జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సిర్పలింగం

నిజామాబాద్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని డాక్టర్ దాశరథి శతజయంతి కమిటీ ప్రధాన కార్యదర్శి సిర్పలింగం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల సీనియర్ సిటీజన్ పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాశరథి తెలంగాణ ఉద్యమం కోసం నాటి నైజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు అని అన్నారు. తన కవితల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని చేసి తెలంగాణ ఉద్యమంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారని అన్నారు. దాశరథి గడిపిన ఖిల్లా జైలును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం దాశరథి శతజయంతి ఉత్సవ ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోనేరు సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సిర్పలింగం, ప్రజా కళామండలి సహాయ కార్యదర్శి అష్టగంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నర్సింలు, కోశాధికారిగా ఆంజనేయులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా, ఆహ్వాన కమిటీ సభ్యులుగా పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేశవేణు, సాయిలు, నర్సింహం, రాకేష్, రఘు, రాఘవేంద్ర, రాములు, రాథోడ్, రాజమల్లు, శంకర్‌గౌడ్, నర్సింహారావు, నాగేశ్వర్‌రావు, బండారు లక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు. సలహాదారుడిగా ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శ్రీలత, శ్రీనివాస్, లక్ష్మణ్, గోవర్ధనాచారి, నర్సారెడ్డి, చరణ్, శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డును డిప్యూటీ కమిషనర్ రవిబాబు పరిశీలించారు. నాగారంలోని డంపింగ్ యార్డును గురువారం పరిశీలించి డంపింగ్ యార్డు అధికారుల పనితీరును పరిశీలించారు. నూతనంగా డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో బయోమైనింగ్, బయోగ్యాస్, తదితర యంత్రాలను పరిశీలించారు. బయోమైనింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో పెరుగుతున్న మొక్కలను పరిశీలించి ప్రతీ మొక్కను కాపాడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డు ఇంచార్జి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరికి దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండగా బీసీలకు కూడా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బగ్గలి అజయ్ కోరారు. గురువారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కొనసాగించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొయ్యాడ శంకర్, విజయ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలల్లో విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 29వ తేదీ హైదరాబాద్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం డిజైన్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వార్షిక అబాకస్ అడ్వాన్స్ లెవల్-2, బ్రెయిన్‌జిమ్, మెంటల్ ఆర్థమెటిక్ పోటీలలో నగరంలోని విజయ్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబర్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న పోటీలలో విజయ్ హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న టి.హర్షిక అబాకస్ లెవల్-2లో పాల్గొని ద్వితీయ స్థానం పొందింది. 4వ తరగతి చదివే సహస్ర బెస్ట్ పర్‌ఫార్మర్‌గా అవార్డు గెలుచుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ ప్రభాదేవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత గురువారం అభినందించారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



గడ్కోల్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్నటీయూసీఐ నాయకులు

సిరికొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ నిజామాబాద్ రూరల్-కామారెడ్డి సంయుక్త జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న కోరారు. మండలంలోని గడ్కోల్‌లో గురువారం సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ముత్తెన్న సహచర సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్తెన్న మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. కార్మిక వర్గాన్ని బలిపశువులను చేయడానికి తీసుక వచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్, ఉపాధ్యక్షుడు సత్తెక్క, ఎల్. ప్రకాష్, సహాయ కార్యదర్శులు రాజేశ్వర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు వామపక్ష పార్టీల మద్దతు

నిజామాబాద్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాల పిలుపు మేరకు ఈనెల 9న నిర్వహించతలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మెకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వామపక్ష పార్టీల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణలు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహిస్తున్న సమ్మెకు కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు ముత్యాలు, రాధాకుమార్, సీపీఐన్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కార్మికవ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, నరేష్, మహేష్, జాదవ్ మురళి, ప్రభాకర్, నవీన్‌కుమార్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కాలూర్ జడ్పీహెచ్‌ఎస్ స్థలాన్ని కాపాడాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాలూర్ జడ్పీహెచ్‌ఎస్ స్థలాన్ని కాపాడాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. కబ్జా చేస్తూ అధికారుల ఆదేశాలను పదే పదే దిక్కరిస్తూ చేస్తున్న నిర్మాణాన్ని తక్షణమే ఆపించాలన్నారు. అధికారులను తప్పుదోవ పట్టించి తీసుకున్న అనుమతిని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ హైస్కూల్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఈ విషయాన్ని పూర్వవిద్యార్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం పలుమార్లు కలెక్టర్‌కు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామానికి చెందిన ముస్కె సంతోష్ అనే వ్యక్తి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలకు సంబంధించిన సుమారు 20 గజాల స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని లేదంటే విద్యార్థి ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారుల బృందం

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ధర్పల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ అధికారులకు, లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోన వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 586 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. 400 ఇళ్లు ప్రస్తుతానికి మార్క్‌ఔట్ ఇచ్చినట్లు తెలిపారు. అనాసక్తిగల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు జాబితాలో పేర్లు వచ్చి కట్టుకోని లబ్ధిదారులు లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. అనంతరం నర్సరీలను, డంపింగ్ యార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు.

న్యాల్‌కల్‌లో బోనాల పండుగ

మోపాల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో గురువారం సాయంత్రం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బోనాల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వీడీసీ పెద్దలు తెలిపారు. కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరు మహాలక్ష్మమ్మ బోనాల పండుగలో పాల్గొంటారు. మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలో ఉన్న మహాలక్ష్మమ్మకు మొక్కుకున్న కోరికలు నెరవేరుతాయన్న నమ్మకం ఉందని అన్నారు. ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. ఈ పండుగ రోజు వివిధ గ్రామాలలో ఉన్న బంధుమిత్రులందరూ గ్రామానికి వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు కిరణ్‌రావు, శ్రీధర్‌రావు, సతీష్‌రావు, చిన్నగంగారాం, సాయిలు, రాములు, వీడీసీ పెద్దలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

స్టిక్కర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో రూపొందించిన బ్యానర్‌ను, 'సే నో టు డ్రగ్స్ - ఎస్ టు లైఫ్' స్టిక్కర్లను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం స్టిక్కర్లను, బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిస కాకుండా లయన్స్ ఇంటర్నేషనల్ అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. తమ శాఖ ద్వారా లయన్స్ క్లబ్ చేపడుతున్న మత్తు వ్యతిరేక కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని అన్నారు. యువత సన్మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్‌కర్ర విజయానంద్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, రాఘవేందర్, సహాయ కార్యదర్శి జమాల్‌పూర్ రాజశేఖర్, రీజియన్ పీఆర్వో చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన పూలే అంబేద్కర్ నగర వాసులు

నిజామాబాద్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డివిజన్ నెంబర్ 17లోగల సర్వే నెంబర్ 168లోని పూలే అంబేద్కర్ నగర్ కాలనీలో గత రెండు నెలలుగా రేకుల షెడ్లు వేసుకొని నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అయ్యేలా చూడాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బనిలత ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని పేదలతో పాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు మేకల స్వామి, చంద్రగౌడ్, కిశోర్, ఆశాబాయి, తదితరులు పాల్గొన్నారు.



సిరికొండ పీఏసీఎస్‌లో రైతులకు టోకెన్లు అందజేస్తున్న అధికారులు

యూరియా కోసం ఆందోళన వద్దు

సిరికొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య అన్నారు. గురువారం సిరికొండ పీఏసీఎస్‌లో రైతులకు యూరియాను అందించామని, వ్యవసాయ సహకార సంఘాలతోపాటు ప్రయివేట్ వ్యాపారుల ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని నర్సయ్య తెలిపారు. దశల వారీగా జిల్లా కేంద్రం నుంచి సహకార సంఘాలకు, డీలర్లకు యూరియా సప్లయి అవుతుందన్నారు. ఇప్పటి వరకు పన్నెండు వందల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని తెలిపారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు లారీలు మండలానికి వస్తుందని నర్సయ్య తెలిపారు.

పంటలకు సరిపడా యూరియా నిలువలు..

మాక్లూర్: మండలంలో పంట సాగుకు అవసరమైన యూరియా బస్తాల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి పద్మ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం, ప్రైవేట్ ఫర్టిలైజర్ డీలర్ల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా రైతులకు అవసరమైన మేర అందిచాలని ఒకేసారి ఇవ్వవద్దని ఆదేశించారు. రైతులు ఎక్కువ మోతా దులో యూరియా వాడితే చీడ, పీడలు ఆశిస్తాయని ఆమె అన్నారు.

అవసరం మేరకే యూరియాను వాడుకోవాలి..

వేల్పూర్: అవసరం మేరకే యూరియా, ఎరువులను వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి శృతి రైతులకు సూచించారు. గురువారం మండలం పడిగెల సొసైటీలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో శృతి మాట్లాడుతూ.. మండలంలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా సాగవుతున్నాయని గత ఏడాది వానాకాలం సీజన్‌లో మొత్తానికి 2200 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరగగా ఈ సారి సీజన్ ప్రారంభమై కేవలం ఒక్క నెలలోనే 1400 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు మొదటి దఫా ప్రధానంగా యూరియా అవసరం ఉంటుంది. కానీ రైతులు సీజన్ మొత్తానికి సరిపడా ఎరువులను ఒకేసారి కొనుగోలు చేయడం వలన యూరియా కొరత ఏర్పడే అవకావం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయిరామరాజ్, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: మండలంలోని ఇస్సాపల్లిలో ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఇటీవల యూరియా కొరత ఉండడంతో రైతులు గోదాం ముందు యూరియా కోసం బారులు తీరారు. గురువారం ఉదయం రెండు లారీల యూరియా రావడంతో రైతులకు తొమ్మిదివందల బస్తాలను పంపిణీ చేసినట్లు సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉదయం మరింత యూరియా స్టాక్ రానుందని రైతులందరికీ అందజేస్తామని చైర్మన్ తెలిపారు.

ఆలూర్ : మండలానికి 100 మెట్రిక్ టన్నుల యూరియా అందినట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు, ఏడీఏ విజయలక్ష్మి తెలిపారు. ఒక్కరోజే 2000 బస్తాలు వచ్చాయని, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అవసరానికి తగినంత మాత్రమే తీసుకోవాలని సూచించారు. పంటకాలం మొత్తానికి ఒకేసారి తీసుకుని కొరత సృష్టించవద్దని, వదంతులను నమ్మకుండా ఎరువుల సరఫరా సక్రమంగా జరుతోందని తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల ఓవరాల్ ఛాంపియన్‌గా మహాత్మాజ్యోతిబా పూలే మోర్తాడ్ జట్టు కైవసం చేసుకుంది. రెండో ఛాంపియన్‌గా క్షత్రియ పాఠశాల పెర్కిట్, మూడవ స్థానంలో సిద్ధార్థ పాఠశాల నందిపేట్ కైవసం చేసుకుంది. ఈనెల 2వ తేదీన నగరంలోని రాజారాం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. గురువారం నాగారం స్టేడియంలో విజేతలకు నూతన డీవైఎస్‌వోగా బాధ్యతలు చేపట్టిన పవన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో పవన్ మాట్లాడుతూ మొట్టమొదటి కార్యక్రమం ఆటలకు అమ్మవంటి అథ్లెటిక్స్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. బాలికల విభాగంలో మొదటి ఛాంపియన్‌గా కేజీబీవీ సిరికొండ, రెండో ఛాంపియన్‌గా విజయ్ హైస్కూల్, మూడవ ఛాంపియన్‌గా డిచ్‌పల్లి విద్యా హైస్కూల్ కైవసం చేసుకుంది. బహుమతుల ప్రదానోత్సవంలో జిల్లా ట్రస్మా చీఫ్ అడ్వైజర్‌గా మామిడాల మోహన్, టీచర్స్ యూనియన్ బీసీ నాయకులు మురళీకృష్ణ, అసోసియేషన్ సభ్యులు మధు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జావెలింగ్ త్రో పోటీలకు సిద్ధాంత్

మోపాల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జావెలింగ్ త్రో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు కుందేన్ సిద్ధాంత్ ఎంపికయ్యాడు. జూలై 2వ తేదీన రాజారాం స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోపాల్ మండలం కంజర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలచారి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు జూలై 6, 7 తేదీల్లో హన్మకొండలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోపాలచారి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబర్చి జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని కోరారు.

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఉత్తర మండల పరిధిలోకి వచ్చే గ్రామాల ప్రజలు కొత్త రేషన్ కార్డు కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఉత్తర మండల తహసీల్దార్ భూలోకం విజయ్‌కాంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్ కార్డు, ఉన్న రేషన్ కార్డులో మెంబర్ ఆడిషన్, రేషన్ కార్డులలో పేర్ల తొలగింపు కోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా చెల్లించరాదన్నారు. రేషన్ కార్డుల కోసం దళారులు మధ్యవర్తులను నమ్మరాదని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన దరఖాస్తులపై విచారణ అధికారులు ఇంటి వద్దకే వచ్చి విచారణ జరిపి అర్హతను బట్టి కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తారని అన్నారు. ఉన్న రేషన్ కార్డులో మెంబర్ ఆడిషన్ కొరకు డీసీఎస్‌వోకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులలో పేర్ల తొలగింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే ఉత్తర మండల తహశీల్దార్ కార్యాలయం నందు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం

డిచ్‌పల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 16 ఆరోగ్య ఉపకేంద్రాల యొక్క ఆశాకార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి వైద్యాధికారిని డాక్టర్ క్రిస్టినా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ ఆశాకార్యకర్త ప్రతీరోజు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేయాలని, స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించాలని, నీటి నిల్వలు లేకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలని ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని తల్లిప్రాముఖ్యత గురించి తెలియజేయాలన్నారు. ప్రతీ నెలలో రెండుసార్లు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని, రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాలా, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.210	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.220	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,400	రూ.90,800	రూ.1095

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మెట్రో ఇన్ డినో (హిందీ) (10.10)
: సోలో బాయ్ (1.35)
: తమ్ముడు (4.25, 7.35, 10.45)
స్క్రీన్-2 : షో టైమ్ (10.05)
: కుబేరా (12.30, 4.10, 7.50, 10.40)
స్క్రీన్-3 : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (10.10, 1.00)
: కన్నప్ప (3.50, 10.45)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.30)
స్క్రీన్-4 : ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (10.20)
: 3బిహెచ్‌కె (1.35, 7.55)
: సితారే జమీన్ పర్ (హిందీ) (4.30)
: మెట్రో ఇన్ డినో (హిందీ) (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తమ్ముడు (1.40, 7.20, 10.20)
: 3బిహెచ్‌కె (4.35)
స్క్రీన్-2 : జురాసిక్ వరల్డ్ (తెలుగు 3డి) (11.00, 4.40, 10.30)
: కుబేరా (1.30, 7.20)
స్క్రీన్-3 : 3బిహెచ్‌కె (11.00, 7.20)
: కన్నప్ప (1.40, 10.30)
: సోలో బాయ్ (4.45)

దేవి : కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: తమ్ముడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్